నమస్తే తెలంగాణ

కామారెడ్డి

3 | నిజామాబాద్, శనివారం 4 జనవరి 2025 | KAMAREDDY

ముందడుగు పడేనా?

'బోధన్ షుగర్స్'పై నాన్చుడు ధోరణి

జిల్లాలోని బోధన్ షుగర్ ఫ్యాక్టరీ పునః ప్రారంభంపై సర్వత్రా ఆసక్తి నెలకొన్నది. గత అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఫ్యాక్టరీ తెరిపిస్తామని ప్రస్తుత సీఎం.. పీసీసీ చీఫ్ హోదాలో రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. జిల్లాకేంద్రంలోని పాత కలెక్టరేట్ మైదానంలో ఏర్పాటుచేసిన సభలో సెప్టెంబర్17 లోపే చక్కెర కర్మాగారాన్ని పునఃప్రారంభిస్తామని చెప్పారు. అంతేగాకుండా ఈ అంశాన్ని పార్టీ మ్యానిఫెస్టోలోనూ చేర్చారు. అయితే పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది దాటుతున్నా.. షుగర్ ఫ్యాక్టరీ పునఃప్రారంభ ప్రక్రియపై ఎలాంటి ముందడుగు పడిన దాఖలాలు లేవు. ఫ్యాక్టరీ పునరుద్ధరణ కోసం ఏర్పాటు చేసిన మంత్రుల కమిటీ కేవలం చుట్టపు చూపునకు పరిమితమైంది. ఫ్యాక్టరీ పునః ప్రారంభానికి చర్యలు తీసుకుంటున్నామని ప్రభుత్వ పెద్దలు చెబుతున్నప్పటికీ, ప్రజలకు ఎలాంటి వివరాలను ప్రభుత్వం తెలుపకపోవడం గమనార్హం.

-నిజామాబాద్, జనవరి 3 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)

- ఫ్యాక్టరీ పునఃప్రారంభంపై నిర్లక్ష్యం
- చుట్టపుచూపుగా వచ్చిన మంత్రుల కమిటీ
- ఏనాడూ సమీక్షించని జిల్లా ఇన్‌చార్జి మంత్రి
- ఏడాది తర్వాత నేడు చెరుకు రైతులతో కలెక్టర్ భేటీ
- హాజరుకానున్న స్థానిక ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి
- బోనస్, ప్రోత్సాహకాలు ప్రకటించాలని కర్షకుల డిమాండ్

బోనస్ ఇస్తారా...?

ఎన్నికల సమయంలో పంటలకు రూ.500 చొప్పున బోనస్ ఇస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. ప్రస్తుతం వరిలో సన్న రకాలకే రూ.500 చెల్లిస్తుండగా.. చెరుకు సాగుకు కూడా బోనస్ ఇవ్వాలని రైతులు డిమాండ్ చేస్తున్నట్లు తెలుస్తోంది. లాభాలు దక్కాలంటే బోనస్ ఒక్కటే మార్గమని చెబుతున్నారు. ప్రైవేటు యాజమాన్యం పరిధిలో చెరుకు ఫ్యాక్టరీని తెరిపిస్తారా? లేదంటే ప్రభుత్వమే నడుపుతుందా? ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో చక్కెర కర్మాగారానికి పాత రోజులు తీసుకు వస్తారా? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ప్రైవేటు భాగస్వామ్యమైతే రైతులు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉంది. సకాలంలో చెల్లింపులు, విత్తన సాయం, సాంకేతిక సహకారం వంటి అంశాలపై సందేహాలున్నాయి. బోధన్ డివిజన్ పరిధిలో చాలా మంది చిన్న, సన్నకారు రైతులే ఉన్నారు. వీరి భూ కమతాలు ఎక్కువగా ఎకరం నుంచి రెండు ఎకరాల్లోపే ఉన్నాయి. చిన్న కమతాలను కలిగి ఉన్న రైతులకు చెరుకు సాగు గిట్టుబాటు అవుతుందా? అలాంటి వారికి ఎలాంటి తోడ్పాటు అందిస్తారో నేడు నిర్వహించనున్న సమావేశంలో ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరుకుంటున్నారు.

బోధన్ షుగర్ ఫ్యాక్టరీ పునఃప్రారంభించడానికి అనేక సంక్లిష్టమైన అంశాలు ముడి పడి ఉండగా వాటిపైనా దృష్టి సారించలేదు. పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు నేతృత్వంలో ఏర్పాటైన కమిటీ కేవలం ఒకేసారి బోధన్‌కు వచ్చి వాస్తవ పరిస్థితులను పరిశీలించింది. ఆ తర్వాత ఇటువైపు కన్నెత్తి కూడా చూడలేదు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు సైతం తూతూ మంత్రంగా సమీక్షలు నిర్వహించి వెళ్లి పోయారు. ఏడాది తర్వాత ప్రభుత్వం తరపున బోధన్ డివిజన్ ప్రాంతంలోని రైతులతో కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి నేడు (శనివారం) ఎడపల్లిలో సమావేశం కానున్నారు. ఈ భేటీలో రైతుల సందేహాలను నివృత్తి చేస్తారా? ప్రభుత్వ ఉద్దేశాలను వివరిస్తారా? లేదా? అన్నది వేచి చూడాల్సి ఉంది.

చెరుకు రైతులకు ప్రోత్సాహం లభించేనా?

ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు షుగర్ ఫ్యాక్టరీని తిరిగి ప్రారంభించాలని ప్రతి ఒక్కరూ కోరుకుంటున్నారు. ఇదే అంశంపై పార్టీ నాయకుల వెంట పడుతున్నారు. ఏడాది కాలంగా జాప్యం చేస్తుండడంతో స్థానికుల్లో నిరాశ అలుముకున్నది. ఫ్యాక్టరీ తెరుస్తామంటున్నా.. ఇందుకు కావాల్సిన ప్రధాన ముడి సరుకు చెరుకు పంట సాగుపై ఇప్పటి వరకు ప్రభుత్వం ఆలోచన చేయలేదు. తొలిసారిగా రైతులతో భేటీ అవుతున్న నేపథ్యంలో చెరుకు సాగుపైనే ఎక్కువగా చర్చ జరిగే అవకాశాలు ఉన్నాయి. స్వరాష్ట్రం సిద్ధించాక బోధన్ డివిజన్‌లో సాగు నీటి వసతి భారీగా పెరిగింది. గోదావరి జలాలను ఎత్తిపోతల ద్వారా పంట పొలాలకు మళ్లించడం, కాలువల ఆధునికీకరణ ద్వారా రైతులంతా చెరుకు పంటను వదిలేసి వరి పంట సాగుకే ఎక్కువగా మొగ్గు చూపుతున్నారు. ఈ నేపథ్యంలో తిరిగి దీర్ఘ కాలిక పంట చెరుకును సాగు చేసేందుకు ముందుకు వస్తారా? లేదా? అన్నది తేలాల్సి ఉంది. ఒకవేళ ముందుకు వచ్చినప్పటికీ వారికి ఎలాంటి ప్రోత్సాహకాలు అందజేయనున్నదనే దానిపై ఆసక్తి నెలకొన్నది.

నవీపేటలో బాలికల అదృశ్యం

ఫ్రీబస్ తెచ్చిన కొత్త తంటా

- బడి ఎగ్గొట్టి.. బస్సుల్లో చక్కర్లు
- తల్లిదండ్రుల ఫిర్యాదుతో రంగంలోకి పోలీసులు
- 24 గంటల్లోనే బాలికలను గుర్తించిన ప్రత్యేక బృందాలు
- క్షేమంగా తల్లిదండ్రులకు అప్పగింత

నవీపేట, జనవరి 3: నవీపేటలో ముగ్గురు బాలికల అదృశ్యం కలకలం రేపింది. రోజులానే గురువారం ఇంటి నుంచి బయల్దేరిన పదో తరగతి విద్యార్థినులు బడికి డుమ్మా కొట్టారు. ఉచిత ప్రయాణాన్ని వాడుకుని ఆర్టీసీ బస్సుల్లో రోజంతా చక్కర్లు కొట్టారు. బడికి రాలేదని టీచర్లు ఫోన్ చేయడంతో కంగారు పడిన తల్లిదండ్రులు వెతికీ వెతికీ చివరకు పోలీసులను ఆశ్రయించారు. ఎస్సై వినయ్ నేతృత్వంలో రంగంలోకి దిగిన ప్రత్యేక బృందాలు 24 గంటల్లోనే పిల్లల ఆచూకీ కనిపెట్టి, సురక్షితంగా తల్లిదండ్రులకు అప్పగించారు. ఉచిత బస్సు ప్రయాణమేమో కానీ తమ పిల్లల ప్రాణాల మీదకు తెచ్చిందని తల్లిదండ్రులు వాపోయారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. నవీపేట మండలంలోని ఓ ప్రభుత్వ పాఠశాలలో.. చుట్టు పక్కల ప్రాంతాలకు చెందిన ముగ్గురు బాలికలు పదో తరగతి చదువుతున్నారు. గురువారం ఉదయం స్కూల్‌కు వెళ్తున్నామని చెప్పి ఇంటి నుంచి బయల్దేరిన ఆ ముగ్గురు బడికి డుమ్మా కొట్టారు. ఉచిత బస్సు పథకంలో భాగంగా రోజంతా బస్సుల్లో తిరగాలని ముందుగానే నిర్ణయించుకొని, ఆధార్ కార్డులను వెంట తెచ్చుకున్నారు. స్కూల్ బ్యాగులను ఎక్కడో పడేసి నవీపేట బస్టాండ్‌కు చేరుకున్నారు. బస్సు ఎక్కి తొలుత బోధన్‌కు, అక్కడి నుంచి మళ్లీ నవీపేట్ మీదుగా నిజామాబాద్ చేరుకున్నారు. కామారెడ్డి బస్సెక్కి అక్కడికి వెళ్లి తిరిగి నిజామాబాద్‌కు వచ్చారు. అటు నుంచి నవీపేట్‌కు వెళ్లి మళ్లీ నిజామాబాద్‌కు వచ్చారు. ఇక్కడి నుంచి జగిత్యాలకు వెళ్లి తిరిగి నిజామాబాద్‌కు చేరుకున్నారు.

అయితే, బాలికలు స్కూల్‌కు రాలేదని టీచర్లు తల్లిదండ్రులకు ఫోన్ చేయగా, పొద్దున్నే ఇంటి నుంచి బయల్దేరారని వారు బదులిచ్చారు. స్కూల్‌కు రాలేదని టీచర్లు స్పష్టం చేయడంతో కంగారు చెందిన తల్లిదండ్రులు రోజంతా వెతికారు. ఆచూకీ దొరకక పోవడంతో గురువారం రాత్రి నవీపేట్ పోలీసులను ఆశ్రయించారు. రంగంలోకి దిగిన పోలీసులు మూడు బృందాలుగా విడిపోయి గాలించారు. అదృశ్యమైన బాలికల్లో ఒకరి దగ్గర ఫోన్ ఉండడంతో, సెల్‌ఫోన్ సిగ్నల్ ఆధారంగా ఆమెను గురువారం రాత్రి నిజామాబాద్ బస్టాండ్‌లో పట్టుకున్నారు. మరో ఇద్దరి ఆచూకీ మాత్రం లభ్యం కాలేదు. నవీపేట ఎస్సై వినయ్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు నిజామాబాద్ బస్టాండ్‌లో తిష్ట వేశాయి. ఈ క్రమంలో శుక్రవారం సాయంత్రం ఇద్దరు బాలికలు బస్సు దిగుతుండగా గుర్తించారు. వారిని తీసుకొచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ ఉదంతం నేపథ్యంలో ఉచిత బస్సు పథకం మరోమారు చర్చనీయాంశమైంది.

శాంతిభద్రతల రక్షణలో పోలీసుల పాత్ర కీలకం

- విధి నిర్వహణలో ఎలాంటి ప్రలోభాలకు గురికావొద్దు
- రాష్ట్రంలో ఏడో బెటాలియన్ ట్రైనింగ్ సెంటర్‌కు మంచి గుర్తింపు ఉన్నది
- ఇన్‌చార్జి సీపీ సింధూశర్మ

డిచ్‌పల్లి, జనవరి 3 : శాంతిభద్రతలను కాపాడే విషయంలో పోలీసు పాత్ర కీలకమైనదని, విధి నిర్వహణలో వ్యవహార శైలి బాగుండి, ఎలాంటి ప్రలోభాలకు గురికానప్పుడే ప్రజల్లో గౌరవం ఉంటుందని ఇన్‌చార్జి సీపీ సింధూశర్మ తెలిపారు. మండలకేంద్రంలోని తెలంగాణ రాష్ట్ర ప్రత్యేక పోలీస్ 7వ బెటాలియన్‌లో టీజీఎస్‌పీ- 2024 బ్యాచ్ దీక్షాంత్ పరేడ్ (పాసింగ్ అవుట్ పరేడ్)ను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. తొమ్మిది నెలలపాటు శిక్షణ పొంది, పాసింగ్ అవుట్ అవుతున్న వారికి అభినందనలు తెలిపారు. ప్రతిఒక్కరూ అంకితభావంతో విధులు నిర్వహించి, ప్రజలకు సేవలందించాలని సూచించారు. ఏడో బెటాలియన్ ట్రైనింగ్ సెంటర్‌కు రాష్ట్రంలోనే మంచి పేరు ఉన్నదని అన్నారు. కమాండెంట్ సత్యనారాయణ మాట్లాడుతూ.. 2002లో ఏడో బెటాలియన్ ట్రైనింగ్ సెంటర్‌గా గుర్తింపు పొందిందని, ప్రస్తుతం 14వ బ్యాచ్ శిక్షణ పూర్తిచేసుకున్నదని తెలిపారు. ఈ బ్యాచ్‌లో (491) ఎస్‌సీటీపీసీ రాచకొండ, మహబూబ్‌నగర్, జయశంకర్ భూపాలపల్లి వారిని కేటాయించగా, 463 మంది శిక్షణ పూర్తి చేసుకున్నట్లు వివరించారు. తొమ్మిది నెలల పాటు శిక్షణలో ప్రతిభ కనబర్చిన ఎస్‌సీటీపీసీఎస్‌లతోపాటు శిక్షణ ఇచ్చిన సిబ్బందికి ఇన్‌చార్జి సీపీ ట్రోఫీలు, ప్రశంసాపత్రాలను అందజేశారు. శిక్షణ పొందిన వారిలో బెస్ట్ ఫైర్ జి. శివకృష్ణ, బెస్ట్ అవుట్‌డోర్ అండ్ బెస్ట్ ఆల్‌రౌండర్ బి.రవి, బెస్ట్ ఇండోర్ కె.నవీన్‌కుమార్‌రెడ్డి, పరేడ్ కమాండర్ జి.నిరంజన్ రెడ్డి అవార్డులు అందుకున్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ శరత్‌కుమార్, సత్యనారాయణ, అయ్యవారయ్య, అనుపమ, ప్రహ్లాద్, వసంత్‌రావు, ఆర్‌ఎస్సైలు పాల్గొన్నారు.

ప్రతిభ కనబర్చిన వారికి ట్రోఫీ అందజేస్తున్న ఇన్‌చార్జి సీపీ

గౌరవ వందనం స్వీకరిస్తున్న ఇన్‌చార్జి సీపీ సింధూశర్మ

కేసీఆర్ నిధులిస్తే.. కాంగ్రెస్ నిలిపేసింది

అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ ..

వినాయక్‌నగర్, జనవరి 3: నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గానికి టీయూఎఫ్‌ఐడీసీ నుంచి కేసీఆర్ ప్రభుత్వం ఒక్కో డివిజన్‌కు రూ. కోటి చొప్పున మొత్తం రూ. 60 కోట్ల నిధులు మంజూరు చేస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం నిలిపివేసిందని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి రేవంత్ సర్కార్ అడ్డుగా నిలిచిందని మండిపడ్డారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఇచ్చిన ఉద్యోగాల నోటిఫికేషన్లకు రేవంత్ ప్రభుత్వం అపాయింట్‌మెంట్లు ఇచ్చి 50 వేల ఉద్యోగాలు ఇచ్చామంటూ నిరుద్యోగులను మోసం చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు.

కంటైనర్‌లో మంటలు

కామారెడ్డి, జనవరి 3 : కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని టేక్రియాల్ జాతీయ రహదారిపై శుక్రవారం తెల్లవారుజామున ఓ కంటైనర్ దగ్ధమైంది. దేవునిపల్లి ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ నుంచి ఎలక్ట్రికల్ స్క్రాప్‌తో నాగపూర్ వైపు వెళ్తున్న కంటైనర్ టేక్రియాల్ స్టేజ్ వద్దకు రాగానే ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. స్థానికుల సమాచారంతో హైవే పెట్రోలింగ్ పోలీసులు, ఫైర్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తెచ్చారు. కంటైనర్‌లో ఉన్న ఎలక్ట్రికల్ స్క్రాప్, కేబుల్ వైర్స్ దగ్ధమయ్యాయని, వీటి విలువ రూ. నాలుగు లక్షల వరకు ఉంటుందని ఎస్సై తెలిపారు. డ్రైవర్‌కు ఎలాంటి ప్రమాదం జరగలేదని తెలిపారు.

దగ్ధమవుతున్న కంటైనర్

ఇండ్ల పట్టాలు ఇవ్వాలని ఆందోళన

కామారెడ్డి కలెక్టరేట్ ఎదుట డబుల్ బెడ్రూం ఇండ్ల లబ్ధిదారుల ధర్నా

కామారెడ్డి, జనవరి 3 : తమకు డబుల్ బెడ్‌రూం ఇండ్ల పట్టాలు ఇవ్వాలని మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లి, రాజీవ్ నగర్, ఇల్చిపూర్, రామేశ్వర్‌పల్లి, నర్సన్నపల్లికి చెందిన కాలనీవాసులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు కామారెడ్డి కలెక్టరేట్ ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమకు గత ప్రభుత్వం డబుల్ బెడ్రూం ఇండ్లు కేటాయించినా, ఇప్పటి వరకు అధికారులు పట్టాలు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. వసతులు కూడా కల్పించడం లేదన్నారు. తమకు పట్టాలు ఇచ్చే వరకూ ఇక్కడి నుంచి కదలబోమంటూ భీష్మించుకు కూర్చున్నారు. ఆర్డీవో శ్రీనివాస్ రెడ్డి అక్కడికి చేరుకొని మాట్లాడుతూ.. తనకు వారం రోజుల సమయం ఇవ్వాలని, పట్టాలు అందిస్తానని చెప్పడంతో ఆందోళన విరమించారు.

కలెక్టరేట్ ఎదుట బైఠాయించిన డబుల్ బెడ్రూం ఇండ్ల కాలనీవాసులు

సావిత్రీబాయి పూలేకు ఘన నివాళి

ఉమ్మడి జిల్లాలో శుక్రవారం చదువుల తల్లి సావిత్రీబాయి పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలలు, వివిధ పార్టీల కార్యాలయాల్లో ఆమె చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సమాజహితం కోసం ఆమె చేసిన కృషిని కొనియాడారు

బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో సావిత్రీబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మేయర్ నీతూ కిరణ్, జడ్పీ మాజీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, నాయకులు

బరితెగింపు

- వివాదాలకు కేంద్రంగా కామారెడ్డి విద్యాశాఖ
- ఇష్టారీతిన వ్యవహరిస్తున్న కొందరు అధికారులు
- కలెక్టర్ కాదనడంతో విద్యాశాఖ డైరెక్టర్‌తో ఉత్తర్వులు
- ఆశావహులకు అధికారుల ఉచిత సలహాలు
- మరోసారి చర్చనీయాంశమైన డిప్యుటేషన్లు

నిజామాబాద్, జనవరి 3 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): కామారెడ్డి జిల్లా విద్యాశాఖ పైరవీలకు అడ్డాగా మారింది. కొందరు ఉన్నతాధికారులే బరితెగిస్తుండడం విమర్శలకు తావిస్తున్నది. డిప్యుటేషన్ల విషయంలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. డీఈవో ఆఫీస్‌లో జరుగుతున్న తంతుపై గతంలోనే కామారెడ్డి కలెక్టర్ విచారణ చేయించి అక్రమ డిప్యుటేషన్లను రద్దు చేశారు. ఎమ్మెల్యే సిఫార్సు లేఖలనూ చెత్తబుట్టలో వేయించారు. కలెక్టర్ కఠిన చర్యలు చేపట్టినప్పటికీ విద్యాశాఖలో ఏ మార్పూ కనిపించడంలేదు. ఓ వైపు సమగ్రశిక్షా అభియాన్ ఉద్యోగులంతా మూకుమ్మడిగా సమ్మెలో ఉండడంతో కేజీబీవీలు నడువడం లేదు. విద్యార్థులు నష్టపోతుంటే పట్టించుకోని ఉన్నతాధికారులు డిప్యుటేషన్ల తతంగానికి మాత్రం రాచబాటలు వేస్తున్నారు. డిప్యుటేషన్ కోసం అర్రు లు చాస్తున్న టీచర్లకు డీఈవో కార్యాలయంలోనే కొంత మంది వక్రదారులను చూపిస్తున్నారని ప్రచారం జరుగుతున్నది. అధికార పార్టీ నేతలతో పైరవీ చేసుకుని డిప్యుటేషన్ తెచ్చుకునేందుకు చా లా మంది వరుస కడుతుండడం హాట్ టాపిక్‌గా మారింది.

కఠినంగా కలెక్టర్..

ఎల్లారెడ్డి హైస్కూల్ నుంచి ఓ తెలుగు టీచర్‌ను రాజంపేట మండలానికి డిప్యుటేషన్ వేశారు. మండలం దాటి డిప్యూటేషన్‌ను అమలు చేశారు. ఇదే తరహా డిప్యుటేషన్లను కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ గతంలోనే రద్దు చేశారు. ఒకే మండలంలో సర్దుబాట్లు ఉండాలని స్పష్టంగా పేర్కొన్నారు. కానీ స్కూల్ ఎడ్యుకేషన్ ఉన్నతాధికారుల పేరిట వచ్చిన ఆర్డర్‌లో కాపీలో మాత్రం సదరు ఉపాధ్యాయుడికి ఏ ప్రాతిపదికన డిప్యుటేషన్‌ను వర్తింపజేశారో పేర్కొనలేదు. సాధారణంగా డిప్యుటేషన్ అమలులో కుటుంబ, ఆరోగ్య సమస్యలను ప్రధాన అంశంగా పరిగణలోకి తీసుకుని మానవీయ కోణంలో సర్దుబాట్లు చేయడం పరిపాటి. కానీ హైదరాబాద్ ఉన్నతాధికారుల పేరిట జారీ చేసిన ఉత్తర్వుల్లో మాత్రం అదేదీ లేకపోవడం చర్చకు తావిస్తున్నది. చాలా మంది టీచర్లు వివిధ అవసరాల రీత్యా డిప్యుటేషన్లకు మొగ్గు చూపుతున్నారు. పట్టణ ప్రాంతాలకు వచ్చేందుకు పోటీ పడుతున్నారు. విద్యాశాఖ డైరెక్టర్, కలెక్టర్ ఎవరైనా తమ స్థాయిలో నిబంధనలు అమలు చేయాల్సిందే తప్ప అతిక్రమించకూడదు. కామారెడ్డి వ్యవహారంలో మాత్రం అందుకు విరుద్ధంగా నడుస్తున్నది. ఉన్నతాధికారుల ఆదేశాలు రావడంతో ఎల్లారెడ్డిలో ఖాళీ అయిన పోస్టును మరొకరిని డిప్యుటేషన్ ద్వారా కామారెడ్డి విద్యాశాఖ అధికారులు సర్దుబాటు చేసినట్లు సమాచారం. 2021లో జారీ చేసిన జీవో నంబర్ 25 ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం సైతం ప్రొసీడింగ్స్‌ను జారీ చేసింది. అవే నిబంధనలు డిప్యుటేషన్లకు వర్తిస్తాయంటూ స్పష్టంగా పేర్కొన్నప్పటికీ క్షేత్ర స్థాయిలో అమలు కావట్లేదు. ఇటీవల జుక్కల్, ఎల్లారెడ్డి ఎమ్మెల్యేలు డిప్యుటేషన్లకు సిఫార్సు చేయగా కలెక్టర్ వాటిని రద్దు చేశారు. 29 మంది ఉపాధ్యాయుల అక్రమ డిప్యుటేషన్లు నిలిచి పోయాయి.

బదిలీ జరిగినా..

సుదీర్ఘ కాలంగా ఒకే ప్రాంతంలో పని చేస్తున్న విద్యాశాఖలోని కీలక అధికారిని ప్రభుత్వం బదిలీ చేసింది. నిజామాబాద్ డీఈవో అకస్మాత్తుగా బదిలీ వేటు వేసిన చందంగానే కామారెడ్డి జిల్లాకు సైతం వర్తించేలా బదిలీ ఉత్తర్వులను విద్యాశాఖ డైరెక్టర్ జారీ చేశారు. నెలలు గడుస్తున్నా సదరు ఉన్నతాధికారి మాత్రం కామారెడ్డిని వదిలి వెళ్లలేదు. ఇదే విషయపై ఎవరైనా అడిగితే తనకు రిలీవర్ రావడం లేదంటూ చెబుతున్నారు. తన స్థానంలో ఎవరికైనా పోస్టింగ్ ఇస్తేనే తాను వెళ్లేందుకు అవకాశం ఉంటుందని చెబుతుండడం గమనార్హం. ఉన్నతాధికారిని ప్రభుత్వం బదిలీ చేసి మరొకరికి ఈ స్థానాన్ని కేటాయించకపోవడం అనుమానాలకు తావిస్తున్నది. వివాదాస్పద వ్యక్తితో తప్పుడు పనులు చేయించుకునేందుకే ఇలా చేసినట్లు టీచర్లలో చర్చ జరుగుతున్నది. ఒక వ్యక్తిని ఆరేళ్ల పాటు ఒకే జిల్లాలో ఒకే పోస్టులో కొనసాగించడంపై తీవ్ర విమర్శలున్నాయి. గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో బదిలీకి రంగం సిద్ధమైనప్పటికీ ఎన్నికల కోడ్ మూలంగా నిలిచింది. కానీ ఇప్పుడు కాంగ్రెస్ నేతలే అడ్డుపుల్లలు పెట్టి సాంకేతిక కారణాలతో వివాదాస్పద అధికారికి అండగా నిలుస్తున్నట్లు చర్చ జరుగుతున్నది. రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందిన ఓ ఉపాధ్యాయ సంఘం నేతలు కూడా ఈ వివాదాస్పద అధికారికి అండగా నిలుస్తున్నట్లు ప్రచారం ఉన్నది.